వివేకానందుడు యువతకు స్ఫూర్తి

యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వివేకానందుడిని యువత స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. వివేకానందుడు చికాగో నగరంలో చేసిన ప్రసంగం యావత్ ప్రపంచాన్ని ఆకర్షించిందన్నారు. మన సంప్రదాయాలు, సంస్కృతి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిపారని, ప్రతి ఒక్కరిలో అద్వితీయమైన శక్తి దాగి ఉందని ఉన్నత స్థాయికి చేరాలన్న సంకల్పానికి కృషి, పట్టుదల అత్యంత అవసరమన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని కృషి పట్టుదల ఉంటే, యువత ఎలాంటి చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గంలో పయనిస్తే విజయానికి చేరువలో ఉంటారన్నారు. - సాక్షి నెట్‌వర్క్


మహబూబాబాద్ రూరల్: వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, తదితరులు


మహబూబాబాద్ అర్బన్: వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధ్యాపకులు


మహబూబాబాద్: నివాళులర్పిస్తున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా


కేసముద్రం: వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


మహబూబాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


తొర్రూరు రూరల్: పోలెపల్లిలో..


దంతాలపల్లి: నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శ్రీనువాసరావు


కురవి: తాట్యతండాలో నివాళులర్పిస్తున్న చిన్నారులు..

క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేదలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలతోపాటు అందరు ముందుకు రావాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యుడు కుందూరు రాజేందర్‌రెడ్డి అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ తొర్రూరు వారి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, దోమతెరలు, ఇతర వస్తువులను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు తమ్మెర విశేశ్వర్ రావు, రెగూరి వెంకన్న, వెంకట్‌రెడ్డి, వీరభద్రా రావు పాల్గొన్నారు.

కుడారై మహోత్సవం



గార్ల: ధనుర్మాసోత్సవంను పురస్కరించుకొని గార్ల లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో శుక్రవారం కుడారై మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఒబిలిశెట్టి కృష్ణ, వాసవి దంపతులు 108 గంగాళములు, పట్టువస్త్రాలను అమ్మవారికి సమర్పించారు.

సంక్రాంతి సంబురాలు



దోర్నకల్: మండలంలోని నిర్మలా హైస్కూల్‌లో పిల్లల పేరెంట్స్ కోసం నిర్వహించిన ముగ్గుల పోటీలలో ముస్లిం మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. సెయింట్ ఆగ్నేస్ పాఠశాలలో జరిగిన పోటీల్లో ఎస్సై రూన్సీ, ప్రిన్సిపాల్ హెలెన్‌రాణి బహుమతులు అందించారు.

తొర్రూరులో..

తొర్రూరు: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి అన్నారు. హార్ట్‌ఫుల్ నెస్ ధ్యాన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు, వస్త్రాలంకరణ, వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని వికాస్ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శుక్రవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ ఇందిర, ప్రిన్సిపాల్ వీరయ్య, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: స్థానిక జూనియర్ కాళాశాల, మండలంలోని చిన్నముప్పారం శ్రీసాయి పబ్లిక్ పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం వివేకానందకు నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామం ఆఫీసర్ అనిల్, పాఠశాల హెచ్ఎం కాలేరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రాజెక్టు మేనేజర్‌కు సన్మానం

నెల్లికుదురు: స్థానిక మండల మయూరి వెలుగు కార్యాలయంలో శుక్రవారం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ గద్దం శ్రీనివాస్‌కు వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు బాలాజీనాయక్ స్థానిక నాయకులతో కలిసి శాలువాతో సన్మానించారు. వీఓఏల వేతనాల పెంపునకు కృషి చేసినందుకు సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వర్ధయ్య, నాయకులు యాకయ్య, ప్రకాష్, ఉపేందర్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

కురవి: మహిళను అవమానపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీరోలు ఎస్సై విజయ్‌రామ్‌కుమార్ శుక్రవారం తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సీరోలు శివారు రేకుల తండా జీపీలో శుక్రవారం తేజావత్ జ్యోతి అనే మహిళ పొలం పనులు చేసేందుకు కూలీలను తీసుకుని హైదర్సాయిపేటకు ఆటోలో వెళ్తున్నారు. ఈక్రమంలో అదే తండాకు చెందిన తేజావత్ దశసింగ్ అనే వ్యక్తి మా పొలంలో పనిచేయకుండా పక్క ఊరికి పనికి వెళ్తున్నారని ఆటోను అడ్డుకుని అందులో ఉన్న తేజావత్ జ్యోతితో గొడవపడే క్రమంలో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసనట్లు ఎస్సై వివరించాడు.

కబడ్డీ విజేత ఖమ్మం



కురవి: మండలంలోని బలపాల గ్రామంలో మూడు రోజులపాటు నిర్వహించిన ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల స్థాయి కబడ్డీ పోటీల్లో శుక్రవారం ఖమ్మం జిల్లా జట్టు విజయం సాధించి కప్‌ను కై వసం చేసుకుంది. రూ.30వేల ప్రైజ్‌మనీ దక్కించుకుంది. ద్వితీయ స్థానాన్ని వరంగల్ జట్టు, తృతీయ స్థానంలో చెరువు మాదారం, నాలుగో స్థానంలో స్థానిక బలపాల జట్టు విజయం సాధించింది. విజేతలకు దేవులపల్లి కేశవరావు, కంకిపాటి శ్రీనివాసరావు, అంబటి వెంకటనారాయణ, పిట్టల వెంకన్న బహుమతులను అందజేయగా సర్పంచ్ ముండ్ల ప్రమీల, ఎంపీటీసీ పిట్టల రమణ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నగదు బదిలీ పథకాన్ని ప్రకటించాలి

నెహ్రూసెంటర్: యాదవులకు నగదు బదిలీ పథకాన్ని రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించాలని, నిరుద్యోగ యువతి, యువకులకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గొర్రెల పంపిణీ పథకం కాకుండా నగదు బదిలీ పథకం అమలు చేయడం ద్వారా మేలు జరుగుతుందన్నారు. అటవీ ప్రాంతాల్లో గొర్లకాపరులను రాకుండా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రతి గ్రామంలో గొర్ల, మేకల పెంపకందారులకు 5 ఎకరాల భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, దిలీప్, బాబురావు, రేఖా దేవేందర్, రాజేష్, మధు, వేణు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యంగా ఉండాలి

కురవి: సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు ఐక్యంగా ఉండాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, అధ్యక్షుడు ఆకుల రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘం అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్ పోతుగంటి మల్లయ్య, భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాడబోయిన శ్రీశైలం, ఎర్రి సుధాకర్, నాయకులు కోటేష్, షేక్ ఉస్మాన్, మల్లయ్య, శ్రీను, నాగన్న పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ నెహ్రూనాయక్‌కు ఇవ్వాలి

కురవి: కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ ఎంపీ టికెట్‌ను మాలోత్ నెహ్రూనాయక్‌కు ఇవ్వాలని డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గుగులోత్ నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే మురళీనాయక్


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందజేస్తామని స్పష్టం చేశారు. మహబూబాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తన ఆశయమని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పనులు చేసే విషయంలో దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో భూక్య ఉమా, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు పోతురాజు రాజు, భూక్య శ్రీను, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, శంతన్ రామరాజు, రాములునాయక్, రమేష్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి

సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ గోర్ సేన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మురళీనాయక్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోడ హరిలాల్ నాయక్, ఉపాధ్యక్షుడు బానోత్ సురేష్ నాయక్ పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించాడు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య, ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి పర్వతం తిరుపతి పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ, సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట పట్టణంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను డీఈఓ రామారావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి పది ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా పనిచేయాలన్నారు. అనంతరం పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బద్రినారాయణ మాట్లాడుతూ. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను సంక్రాంతి కానుకగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు రాంజీ నాయక్, మురళీధర్‌స్వామి పాల్గొన్నారు.

పార్టీని దెబ్బతీసే వారిపై చర్య తీసుకోవాలి


మాట్లాడుతున్న రామునాయక్

బయ్యారం: మండలంలో కాంగ్రెస్ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా గ్రూపులను ప్రోత్సహిస్తున్న వారిపై రాష్ట్ర, జిల్లా నాయకత్వం చర్యలు తీసుకోవాలని పార్టీ అనుబంధ ఎస్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ రామునాయక్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం బయ్యారంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంబాల ముసలయ్య, జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్‌రెడ్డికి తప్పుడు సమాచారం ఇస్తూ మండలంలో ఇతర నాయకులు లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తన స్వార్థం కోసం సొసైటీ అధ్యక్షుడు మధుకర్‌రెడ్డిని టార్గెట్ చేసి తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారన్నారు. ఈవిషయంపై త్వరలో జిల్లా అధ్యక్షుడు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్యలకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు శైలజ, లక్ష్మి, మోహన్‌జీ, సర్పంచులు లక్ష్మి, రాజు, కిరణ్, అనసూర్య, సొసైటీ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్ రావు, శ్రీను పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


విజేతలతో సీతారాంరెడ్డి

మహబూబాబాద్ రూరల్: క్రీడలతో శారీరక దృఢత్వం పెంపొందుతుందని, మానసిక ఉల్లాసం లభిస్తుందని జమాండ్లపల్లి శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవాలయ చైర్మన్ నామిరెడ్డి సీతారాం రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో నామిరెడ్డి జాయింట్ ఫ్యామిలీ ట్రస్ట్ సౌజన్యంతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమంలో సింగంశెట్టి బాబురావు, నరేష్, విజయ్, సాయి, యాకన్న, అశోక్ పాల్గొన్నారు. మండలంలోని గడ్డిగూడెం గ్రామంలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో ఖోఖో టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీవీ నాయక్ హాజరై టోర్నమెంట్ ప్రారంభించారు. సర్పంచ్ భూక్య వసరాములు పాల్గొన్నారు.

నూతన విధానాన్ని రద్దు చేయాలి

కేసముద్రం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గ్రామీణ పేదలను ఉపాధి పనుల నుంచి దూరం చేసిందని, నూతన విధానాన్ని తీసుకొచ్చి పేదలను అన్యాయం చేస్తుందని, వెంటనే నూతన విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కుర్ర మహేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులతో ఆధార్ ఆధారిత వేతన చెల్లింపులు నూతన విధానం తీసుకొచ్చిందని, ఈ విధానంతో 9కోట్ల గ్రామీణ పేదల జాబ్‌కార్డులను తొలగించిందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న, సూరారెడ్డి, దొంతరపోయిన సరిత, పొన్నాల జ్యోతి, ఉప్పలయ్య, యాకయ్య పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి


ఆయా శాఖల అధికారులతో ఎమ్మెల్యే

తొర్రూరు రూరల్: పాలకుర్తి నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతూ పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నింటిని త్వరగా పూర్తి చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్వినిరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని వెలికట్ట గ్రామశివారులోని మిషన్ భగీరథ భవనంలో విద్యారంగం, మిషన్ భగీరథ, ట్రైబల్ వెల్ఫేర్, ఇళ్ల నిర్మాణాలు, మున్సిపాలిటీలో రోడ్లు, ఇతర పనులు, విద్యుత్ రంగంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త లైన్ల ఏర్పాటు, ఆర్‌అండ్‌బీ రంగంలో పెండింగ్ రోడ్ల నిర్మాణాలు, కొత్త రోడ్ల ఏర్పాటు వంటి ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులు గుర్తించి పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే సంబంధిత కాంట్రాక్టర్లను మార్చాలని సూచించారు. ఈ సమీక్షలో ఆయాశాఖల డీఈలు, ఏఈలతోపాటు డీసీసీబీ డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్‌రావు, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.

తగిన పరిహారం అందించాలి

కేసముద్రం: మండలంలోని తావుర్యాతండా జీపీ సమీపంలోని పంట భూముల మీదుగా ఎన్‌హెచ్ 163 నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే వెళ్తుందని, ఇందుకుగాను భూనిర్వాసితులకు మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రభుత్వం పరిహారం అందించాలంటూ పలువురు రైతులు శుక్రవారం తహసీల్దార్ దామోదర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతులు మల్లయ్య, మంజుల, భద్రు, యాకయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

చెట్టును ఢీకొట్టిన గ్రానైట్ లారీ

మహబూబాబాద్ రూరల్: గ్రానైట్ రాళ్లతో వస్తున్న ఓ లారీ చెట్టును ఢీకొన్న సంఘటన జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయం సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండలం పెనుగొండ ప్రాంతం నుంచి గ్రానైట్ రాళ్ల లోడుతో ఉన్న లారీ ఖమ్మం జిల్లా కేంద్రానికి వెళ్తుంది. లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న మర్రి చెట్టును ఢీకొంది. గ్రానైట్ రాళ్లు రహదారిపై పడ్డాయి. పోలీసులు చేరుకుని జేసీబీ సహాయంతో వాటిని పక్కకు తొలగించారు. గాయాలైన డ్రైవర్‌ను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురి బైండోవర్

దంతాలపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం గుడుంబా కేసులో ముగ్గురి వ్యక్తులను బైండవర్ చేసినట్లు ఆబ్కారీ సీఐ భాస్కరరావు తెలిపాడు. మండలంలోని రేపోని గ్రామానికి చెందిన సెంచల ముత్తయ్య, ఉర్లుగొండ రాధమ్మ, గున్నెపల్లి గ్రామానికి చెందిన అల్లి శశిరేఖలను తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు తెలిపాడు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మహబూబాబాద్ రూరల్: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామశివారు బోరింగ్‌తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. తండాకు చెందిన బానోత్ తిరుమల్ పాల వ్యాపారం చేస్తుంటాడు. అతడి భార్య జ్యోతి ఇంటి ఆవరణలోని రేకుల షెడ్డు కింద ఉన్న గేదెలకు పచ్చిగడ్డి వేసేందుకు వెళ్లింది. గేదె కిందపడి కొట్టుకుంటుండగా జ్యోతి వెళ్లి చూడగా విద్యుదాఘాతానికి గురైంది. కొంత సమయానికి గేదె మృతి చెందిన విషయాన్ని గుర్తించారు. వెంటనే స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా గేదెలు ఉన్న రేకుల షెడ్డుపై నుంచి 11 కేవీ విద్యుత్ వైర్లు వెళ్లటం, అవి రేకుల షెడ్డుకు కొంత దూరంలోనే ఉండడంతో విద్యుదాఘాతం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కేసముద్రం: భూక్యారాంతండాజీపీకి చెందిన భుక్యా రవి శుక్రవారం బైక్‌పై కేసముద్రంస్టేషన్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కేసముద్రంవిలేజ్‌లో లోడ్‌తో వెళ్తున్న ఆటో, బైక్ ఢీకొన్నాయి. రవి మోకాలుకు రాడ్డు తాకడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మైనర్‌తో పనులు చేయిస్తున్న యజమానిపై కేసు నమోదు

నెల్లికుదురు: మైనర్ బాలుడితో ఇటుక బట్టి వద్ద పనులు చేయిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపాడు. శుక్రవారం ఎస్సై మాట్లాడుతూ.. మండలంలోని శ్రీరామగిరి గ్రామ బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న ఇటుకల బట్టీల వద్ద తొర్రూరు అసిస్టెంటు లేబర్ ఆఫీసర్ గట్టిపెల్లి వినోద్ కుమార్‌తోపాటు మరిపెడ ఎస్సై మౌలాన, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. కుంజ వెంకటేశ్వర్లు ఇటుకల బట్టీలో ఖమ్మం జిల్లా అశ్వరావుపేట మండలం నందిపాడు గ్రామానికి చెందిన బాలుడు తల్లిదండ్రులతో కలిసి పనులు చేస్తు కనిపించినట్లు తెలిపాడు. లేబర్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు ఇటుక బట్టి యజమాని వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

పతంగి ఎగరేస్తుండగా విద్యుత్‌షాక్

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తానంచర్ల గ్రామానికి చెందిన పోలెపాక మల్సూర్, రేణుక దంపతులు బతుకుదెరువు నిమిత్తం కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారి కుమారుడు పోలెపాక పండు శుక్రవారం హైదరాబాద్‌లో తను ఉంటున్న ఇంటిదాబాపైకి ఎక్కి పతంగి ఎగరేస్తుండగా సమీపంలోని విద్యుత్ తీగలకు చుట్టుకుంది. ఇనుప కడ్డీతో పతంగిని తీసేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. సుమారు 50శాతానికిపైగా పండు కాలిపోయి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అక్కడే ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు బాలుడి సోదరుడు నాగరాజు తెలిపాడు.